క్లుప్తంగా

కేజీబీవీ పరిశీలన

రుద్రూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీడీవో సురేష్ బాబు, జెడ్పీటీసీ సరోజి గంగారాంతో కలిసి సందర్శించారు. నూతనంగా నిర్మించిన విద్యాలయంలో వసతులను పరిశీలించారు. మండలానికి నూతనంగా వచ్చిన ఎంపీడీవో సురేష్ బాబును అధ్యాపకులకు పరిచయం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ పత్తి రాము, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, తదితరులున్నారు.

మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వద్దు

రెంజల్(బోధన్): మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీవో శంకర్ సూచించారు. మండలంలోని కూనేపల్లి, కిసాన్‌తాండ, బాగేపల్లి గ్రామాల్లోని నర్సరీలను సందర్శించారు. క్రమం తప్పకుండా నర్సరీల్లోని మొక్కలకు నీరందించాలని సూచించారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్, కార్యదర్శులు ఉన్నారు.

రూ.5.50 లక్షల విరాళం



రెంజల్(బోధన్): ఆలయాల నిర్మాణాలకు సింహభాగం విరాళాన్ని అందించి ఆదర్శంగా నిలుస్తున్నారు గ్రామానికి చెందిన రైతు నాయకుడు సాయిబాబాగౌడ్. మండలంలోని బాగేపల్లి గ్రామంలో రామాలయం, హన్మాన్ మందిరాలను నిర్మిస్తున్నారు. గ్రామస్తులు ఎకరాకు రూ.2 వేల చొప్పున, పొయ్యికి రూ.వెయ్యి కాడికి అందించారు. మరి కొందరు దాతల సహకారంతో నిర్మాణాలను చేపడుతున్నారు. సాయిబాబాగౌడ్ తన వంతుగా శుక్రవారం ఆలయానికి కుటుంబీకులతో వచ్చి రూ.5,55,555ల నగదును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ సాయాగౌడ్, కార్యదర్శి చింతల గోపాల్, ఎంపీడీవో శంకర్, మాజీ సర్పంచ్‌లు పాముల సాయిలు పాల్గొన్నారు.

ఆట వస్తువుల వితరణ

వేల్పూర్: మోతె ప్రభుత్వ పాఠశాలలకు అగిలేటి స్వచ్ఛంద సంస్థ రూ.2 లక్షల విలువైన ఆట వస్తువులను శుక్రవారం వితరణ చేసింది. వితరణ చేసిన అగిలేటి స్వచ్ఛంద సంస్థకు హెచ్ఎం సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు వీడీసీ చేయూత

కమ్మర్‌పల్లి: ఉప్లూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు దివ్య, కృష్ణశ్రీలకు స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ చేయూత అందించింది. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీడీసీ సభ్యులు విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. వీడీసీ సభ్యులు అవారి శ్రీనివాస్, సుంకరి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీలు

మాక్లూర్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు జీవ పరిణామం శాస్త్రీయ దృక్పథం, మానవ పరిణామ క్రమం అనే అంశాలపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కె నర్సింలు, మండల కన్వీనర్ బోడ ప్రమోద్‌లు శుక్రవారం తెలిపారు. ఈ పోటీలు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న ఉంటాయన్నారు. విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా వారి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి



పెర్కిట్(ఆర్మూర్): కరీంనగర్ జిల్లాలో ఈ నెల 17,18,19 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో నిజామాబాద్ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని హ్యాండ్ బాల్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు గంగా మోహన్ చక్రు ఆకాంక్షించారు. పెర్కిట్ నవ్యభారతి పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే నిజామాబాద్ క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్, కోశాధికారి గటడి రాజేష్, పీఈటీలు అంజు, అనూష, సంజీవ్ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ఎడపల్లి(బోధన్): సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ వినోద్ మాట్లాడుతూ..ఆడపిల్లలు ఆరోగ్యంపై, వారు పాటించాల్సిన శుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలిసి ఉండాలన్నారు. సమస్యలు వచ్చినట్లయితే డాక్టరును సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఏఎస్ఎం అనురాధ, ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వే సజావుగా సాగేనా ?

- సర్వే నంబర్–1333లో ప్రభుత్వ భూమిని వెలికి తీయడానికి సర్వే నిర్వహించిన అధికారులు
- సోమవారం ప్రారంభం.. గురువారం నిలిపివేత
- హద్దులు తేల్చాక మళ్లీ సర్వే అంటున్న అధికారులు
- పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న స్థానికులు



బాల్కొండ మండల కేంద్రంలోని సర్వే నెంబర్–1333లో సర్వే చేస్తున్న అధికారులు

బాల్కొండ: మండల కేంద్రంలో సర్వే నంబర్–1333లో ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయటానికి చేపడుతున్న సర్వే రెండు రోజుల క్రితం నిలిచిపోయింది. దీంతో సర్వే సాగుతుందా లేదా అనే అనుమానం స్థానికుల్లో మొదలైంది. 1333 సర్వే నంబర్‌లో 224.19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి కబ్జాకు గురవుతూ వస్తోంది. కబ్జాలపై సాక్షి దిన పత్రికలో వచ్చిన వార్తా కథనాలకు జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూములను వెలికి తీయాలని అధికారులను ఆదేశించారు. నలుగురు సర్వేయర్లతో కూడిన బృందాన్ని నియమించారు. గత సోమవారం నుంచి సర్వే చేపట్టారు. ప్రస్తుతం ఈ భూమి పక్కన గల ఇతరుల హద్దుల గుర్తించడం పూర్తయిన తర్వాత సర్వే చేపడుతామంటూ రెండు రోజుల నుంచి సర్వే చేపట్టడం లేదు. అసలు సర్వే చేపట్టకుండా హద్దులు ఎలా నిర్ణయిస్తారు? కబ్జాదారులు అడ్డుపడుతున్నారనే ఆరోపణలున్నాయి. 224.19 ఎకరాల ప్రభుత్వ భూమిలో 69 ఎకరాల భూమిని ప్రభుత్వ సంస్థల నిర్మాణానికి, మసీదులు, చర్చిలు, మందిరాల నిర్మాణం కోసం కేటాయించారు. మిగతా భూముల్లో కొండలు, గుట్టు పోగా వాటి పక్కనే ఉన్న 3 ఎకరాల వరకు భూమి కబ్జా చేశారు.

ఒక రోజు ముందే నిర్మాణాలు

ఆర్డీవో వచ్చి రెండు రోజుల పాటు సర్వే చేపడుతామని చెప్పినా కూడా ఒక్క రోజు ముందుగానే ఆ సర్వే నంబర్ పక్కన గల భూమిలోనే రాత్రికి రాత్రి పిల్లర్లు వేసి భవనం నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నం చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉన్నత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వ భూములను వెలికి తీయాలని స్థానికులు కోరుతున్నారు.

ఓ పక్క సర్వే.. మరో పక్క పట్టాలు

ఓ వైపు సర్వే చేపడుతుండగానే మరొపక్క తహసీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేస్తూ పట్టాలను అందజేస్తున్నారు. 2009లో తహసీల్దార్ వద్ద పని చేసిన వీఆర్ఏ, తహసీల్ కార్యాలయంలో రికార్డు కీపర్‌గా పని చేశారు. ప్రస్తుతం రూ.45 వేలకు ప్లాట్లు అంటూ పట్టాలు అందజేస్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ భూముల్లో హద్దు రాళ్లు పాతి ప్లాట్లుగా మార్చుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సర్వేను సక్రమంగా సాగేలా చూస్తారా.. లేక తమకు ఉన్న అంగ, ఆర్థిక బలంతో తూతూమంత్రంగా ముగిస్తారనే అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అధికారులేమో ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం సర్వే చేపడుతామంటున్నారు.

త్వరగా పూర్తి చేస్తాం

సర్వే నంబరు –1333లో గల ప్రభుత్వ భూమికి సంబంధించిన సర్వేను పూర్తి చేస్తాం. ప్రభుత్వ భూమి రికార్డులు కొంత ఇబ్బందిగా ఉండటంతో సర్వేను నిలిపి వేశాం. రెండు రోజుల్లో సర్వేను ప్రారంభిస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఐ ల్యాండ్ సర్వే, నిజామాబాద్

పెర్కిట్ సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సొసైటీ చైర్మన్ పెంట భోజారెడ్డిపై అవిశ్వాసం పెట్టడానికి సొసైటీ వైస్ చైర్మన్ ఇట్టెడి గంగారెడ్డితో పాటు ఏడుగురు డైరెక్టర్లు తీర్మానం చేశారు. జిల్లా కేంద్రంలోని సహకార శాఖ కార్యాలయంలో డీసీవో శ్రీనివాస్ రావుకు డైరెక్టర్ల సంతకాలతో కూడిన తీర్మాన పత్రాన్ని అందజేశారు. డైరెక్టర్ల అవిశ్వాస తీర్మానంపై విచారణ అనంతరం బల నిరూపణకు తేదీని వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు.

అమ్దాపూర్ సొసైటీ చైర్మన్‌పై..

బోధన్‌రూరల్(బోధన్): బోధన్ మండలంలోని అమ్దాపూర్ సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి ఆ సొసైటీ డైరెక్టర్లు శుక్రవారం జిల్లా సహకార అధికారికి నోటీస్ అందజేశారు. సొసైటీ చైర్మన్ గంగారెడ్డిపై అవిశ్వాస తీర్మానం కోరుతూ డైరెక్టర్లు సంతకాలు చేసి నోటీస్ అందజేశారు. అవిశ్వాస తీర్మానం లేఖను పరిశీలించిన జిల్లా సహకార అధికారి త్వరలో తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

వేల్పూర్: పడగల్‌లో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో శనివారం నుంచి సీనియర్స్ ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు జరుగనున్నాయి. దీనికోసం ప్రో కబడ్డీ పోటీల మాదిరిగా ఆధునికమైన మ్యాట్ కబడ్డీ కోర్టును ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణాలోని 5 జిల్లాల నుంచి 22 జట్లు కబడ్డీ టోర్నీలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. టోర్నీలో గెలుపొందిన విన్నర్ జట్టుకు రూ.20 వేలు, రన్నర్ జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి అందిస్తామని వెల్లడించారు. పోటీలు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగుతాయని చెప్పారు.

సరిహద్దు వివాదం పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న జాన్కంపేట్ గ్రామస్తులు

ఆర్మూర్‌టౌన్: వేల్పూర్ మండలంలోని జాన్కంపేట్, పచ్చలనడ్కుడ గ్రామాల మధ్య వాగు సరిహద్దు వివాదాన్ని పరిష్కరించాలని కోరు తూ శుక్రవారం ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎ దుట జాన్కంపేట్ గ్రామస్తులు ఆందోళన చేశారు. జాన్కంపేట్ గ్రామస్తులు మాట్లాడుతూ.. గతంలో ఈ విషయమై తహసీల్దార్‌కు విన్నవించగా ఆయన వల్ల కాకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించామన్నారు. సమ స్య పరిష్కారం అయ్యే వరకు పచ్చలనడ్కుడ గ్రా మస్తులు ఇసుక తరలింపు ఆపేయాలని డిమాండ్‌చేశారు. ఆర్డీవో కార్యాలయం సిబ్బందికి వినతి ప త్రం అందజేశారు. రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి జాన్కంపేట్ గ్రామస్తులను సముదాయించడంతో తిరిగి వెళ్లిపోయారు.

నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలి



బోధన్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు



బోధన్ ఆర్డీవో రాజా గౌడ్‌కు వినతి పత్రం అందిస్తున్న వామపక్ష సంఘాల నాయకులు

సాక్షి నెట్‌వర్క్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా వ్యవసాయ, కార్మిక, విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనలు చేపట్టారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణాలు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ప్రధాన వీధుల గుండా ర్యాలీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను తూర్పారబట్టారు. ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేసి మోదీ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి స్థానికంగా ఉన్న అధికారులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. నాలుగు లేబర్ చట్టాలను వెంటే ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ రద్దు చేసి అందరిని పర్మినెంట్ చేయాలని నినాదాలు చేశారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు. జిల్లాలో బంద్ ప్రభావం పాక్షికంగా కనిపించింది.



ఆర్మూర్ పట్టణంలో ర్యాలీ తీస్తున్న నాయకులు



కోటగిరి తహసీల్ ఆఫీస్ వద్ద ధర్నా

అభివృద్ధికి నిధులు మంజూరు చేయించండి



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని గ్రామస్తులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డిని కోరారు. పెర్కిట్‌లో వినయ్ రెడ్డితో సమావేశమైన గ్రామస్తులు ఆలూర్‌లో ప్రభుత్వ పాఠశాల, వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధితో పాటు పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఆలూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర విజయ్, వీడీసీ అధ్యక్షుడు నలిమెల మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, సొసైటీ మాజీ చైర్మన్ కల్లెం భోజా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని హన్మాన్ ఆలయ సమీపంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులతో కల్సి బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి భూమిపూజ చేశారు. గతంలో బీజేపీ మండల అధ్యక్షుడు కాపు గాండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంక్ అవసరమని ఎల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరై ఆయన గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ చేసినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, బీజేపీ జిల్లా నాయకుడు దొరబాబు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మదర్సాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు



వేల్పూర్: వేల్పూర్ మదర్సాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, వెంటనే వాటిని అరికట్టాలని వేల్పూర్ గ్రామస్తులు తహసీల్దార్ సరిత, వేల్పూర్ ఎస్సై వినయ్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మదర్సాకు ఎటువంటి అనుమతి లేదన్నారు. గ్రామానికి చెందిన పిల్లలను కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి గుర్తు తెలియని పిల్లలను తీసుకువచ్చి నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అంతేగాక దూర ప్రాంతాల నుంచి ముస్లిం మతపెద్దలు మదర్సాకు వచ్చి వేల్పూర్‌లోని ముస్లింలను తప్పుద్రోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

మౌలిక వసతుల కల్పనకు విరాళం



మాక్లూర్: అమ్రాద్ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.50 వేలను విరాళంగా ఇచ్చారు అదే గ్రామానికి చెందిన ఉదయ్ భాస్కర్. ఉదయ్ భాస్కర్ స్థానికంగా లేకపోవడంతో విరాళాన్ని ఆయన తండ్రి శ్యాంసుందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్‌కి స్వయంగా అందించారు. భాస్కర్ తల్లిదండ్రులను పాఠశాలలో సన్మానించారు. పీఆర్‌టీయు జిల్లా నాయకులు మోహన్, మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మెట్టు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లింగం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ ఎంపీటీసీ చేరిక



బోధన్: సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్‌నకు చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ కందిమళ్ల వెంకట్రావ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. కందిమళ్ల వెంకట్రావు గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీటీసీగా గెలుపొందారు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే షకీల్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తిరిగి శుక్రవారం సొంత గూడు కాంగ్రెస్‌లోకి వెళ్లారు. సొసైటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు తూము రవీందర్ రెడ్డి, ఆవుల పద్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు ఇసుక నిల్వల వేలం

రెంజల్(బోధన్): గతంలో పట్టుబడిన రెండు ట్రాక్టర్ల ఇసుకకు శనివారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాంచందర్ తెలిపారు. ఆసక్తి కల్గిన వారు రూ.1000 దరావతు చెల్లించాలని సూచించారు. నీలా గ్రామంలో పట్టుకున్న ఇసుకను తహసీల్ కార్యాలయం ఆవరణలో నిల్వ చేసినట్లు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



ఆర్మూర్ పట్టణంలో ఆటో డ్రైవర్లతో కలిసి ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



మాక్లూర్‌లో జాతీయ రహదారిపై రాస్తారోకో..



జానకంపేట చౌరస్తాలో..

సాక్షి నెట్‌వర్క్ : మహిళలకు ఉచిత బస్సు పథకంతో రాష్ట్ర ప్రభుత్వం తమ పొట్టకొట్టిందని మండిపడుతూ శుక్రవారం ఆటో కార్మికులు జిల్లాలో పలు చోట్ల ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నేతలు మాట్లాడుతూ..రెండు నెలలుగా ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించటం లేదన్నారు. ఫలితంగా రోజుకు కనీసం రూ: 2 వందలు కూడా రావడం లేదన్నారు. ఈఎంఐలు కట్టలేక, జీవనోపాధి సాగక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.

గురుకులాలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో చేపడుతున్న విధంగానే ఆర్మూర్ నియోజకవర్గంలో గురుకులాలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్మూర్‌లో గురుకులాల పరిస్థితి అధ్వానంగా ఉందని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే ఆర్మూర్ ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సులు, వైద్యపరికాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పరిశ్రమలు లేక నిరుద్యోగులుగా మారిన యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారన్నారు. లక్కంపల్లి సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణోత్సవం



కళ్యాపూర్‌లో కల్యాణం జరిపిస్తున్న పండితులు



హాసాకొత్తూర్‌లోని జగదాంబ ఆలయంలో ..



వేంపల్లిలో కల్యాణం జరిపిస్తున్న పండితులు

రెంజల్(బోధన్): కల్యాపూర్‌లో శుక్రవారం వేంకటేశ్వర కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం గ్రామ ఆలయంలో రథసప్తమి రోజున గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను జరిపిస్తున్నారు. భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు. రాత్రి గ్రామంలో పల్లకి సేవ నిర్వహించారు. గ్రామంలో పండగ సందర్భంగా జాతర సాగింది. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామ కమిటీ చైర్మన్ గాండ్ల నాగరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా రథ సప్తమి వేడుకలు

కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లో శుక్రవారం రథ సప్తమి వేడుకలను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జగదాం దేవీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీడీసీ అధ్యక్షుడు కొమ్ముల రజనీకాంత్, కార్యదర్శి కుందారం శ్రావణ్, ఉపాధ్యక్షుడు రాజుల చిన్న బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లి వెంకన్న కల్యాణోత్సవం

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో వేంకటేశ్వరుని కల్యాణోత్సవాన్ని శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా వైభవంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జాతర ఏర్పాటు చేశారు.

వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

బాధ్యతల స్వీకరణ

జిల్లాలో బదిలీపై వచ్చిన అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వారికి స్థానిక సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సత్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్



మోతిసింగ్, వర్ని తహసీల్దార్



ప్రవీణ్ కుమార్, మోస్రా ఎంపీడీవో



వేల్పూర్ తహసీల్దార్ సరితకు సన్మానం



రెంజల్ ఎంఈవో గణేశ్ రావుకు..

దుబ్బ తండాలో బాల్య వివాహం

ఎడపల్లి(బోధన్): దుబ్బ తండాలో బాల్య వివాహం జరిగినట్లు బాల రక్షక భవన్ కో–ఆర్డినేటర్ జర్రము శుక్రవారం ఎడపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు రావడంతో ఆమె గ్రామానికి వెళ్లి విచారణ చేయగా జనవరి 24న బాల్య వివాహం జరిగినట్లు తెలిసింది. బాలికల తల్లిదండ్రులు, భర్త ముకేష్‌పై ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయరాణి ఉన్నారు.

మనిషికి ప్రశాంతత అవసరం

బాల్కొండ: మానవ జీవితంలో ప్రశాంతత అవసరమని సత్యానంద మహర్షి ఆశ్రమాల పీఠాధిపతి ఆచార్య శ్రీహరి తీర్థస్వామి అన్నారు. శుక్రవారం కిసాన్‌నగర్‌లో గీతాశ్రమ వజ్రోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భక్తి ద్వారా మాత్రమే ప్రశాంతత వస్తుందన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	రాజధాని ఫైల్స్ (తెలుగు) – 01.00 మేడమ్ వెబ్(ఇంగ్లీష్)- 4.20, 7.00, 9.40
స్క్రీన్-2 –	ఈగల్ (తెలుగు) – 11.30, 03.00, 6.30, 9.50
స్క్రీన్-3 –	ఊరు పేరు భైరవ కోన(తెలుగు) – 1.00, 4.00, 07.00, 10.00
స్క్రీన్-4 –	మేడమ్ వెబ్(ఇంగ్లీష్)- 12.15 హనుమాన్ (తెలుగు) – 3.30, 6.50 ఓయ్(తెలుగు) – 10.10